దిక్కులేనివారికి దేవుడేదిక్కు

జె. యస్. సోమయాజులు గారు

"ఎల్లావుందిపిల్లకు?"

"ఎల్లాఉండమని చెప్పను! వంటిమీద వడ్లగింజ వేస్తే పేలిపోయేటంత వేడిగా ఉంది!"

"డాక్టరుగారు వచ్చారా?"

"ఆ. మందుసీసా కొని తెమ్మన్నారని చీటీ రాసిచ్చారు. ఇవ్వాళైనా కాస్త పెందరాళే రాకూడదూ?!"

వెంకట్రావుముఖం తెల్లమొహం పాలిపోయింది—అంటే, అతనిముఖం, తుమ్మల్లో పొద్దుగుంకినట్లుంది. దాన్నే, కత్తివాటేస్తే నెత్తురు చుక్కలేదంటారు. నిస్త్రాణుడై, నిర్విణ్ణుడైపోయేడు మందుసీసా కొని తెమ్ముకోవలసివచ్చుట చేత.

వెంకట్రావు బడిపంతులు. స్వంతంగా బడిపెట్టుకొని, పిల్లలదగ్గిర జీతం వసూలు చేసుకుంటూ మర్యాదగా, ప్రభుత్వంవారిచ్చే గ్రాంటు పుచ్చుకుంటూ గౌరవంగా జీవయాత్ర చేస్తున్నాడు. ఆపట్టణంలోని ప్రాథమికపాఠశాలల్లో, వెంకట్రావుగారి బడంటే, చాలాప్రసిద్ధి: ఆపాఠశాలలో అర్చనచేస్తూ ఇతర ఆసక్తులు—వ్యాపారాలు-ఆశలు- పోకడలు లేక, తృప్తిగా నలుగురికి నోట్లో నాలికలా-ఉంటున్నాడు వెంకట్రావు.

వెంకట్రావుభార్య సుశీల - వివేకంగలది-భర్త మనస్సునుగ్రహించి, చేదోడువాదోడుగా ఉంటుంది.

ఆదంపతులికి ఒక ఆడపిల్ల-అయిదేండ్లవయస్సు. ఒక్కక్షణంకూడా ఆపిల్ల నోరు వూరుకోదు-బహు మాటకారి-ఆవీధిలో అమ్మలక్కలు ఆపిల్లనుచూచి నప్పుడల్లా, "నీకు మీఅమ్మ వస ఎక్కువపోసిందా ఏమిఅమ్మాయి" అంటారు. కాని, ఆపిల్ల చిలిపి పనులు చేయదు. ఎదుటివాళ్లకికోపంవస్తే, ఇకమాటాడదు. తల్లిపేరుపెట్టుకుని, ముద్దుగా 'అమ్మణ్ణి'యని పేరుపెట్టి పిలుస్తూ గారాబంగా పెంచుతున్నాడు వెంకట్రావు.

ఒకరోజున అమ్మణ్ణికి జ్వరంవచ్చింది. క్రమంగా హెచ్చింది తగ్గటంలేదు. అల్లంమిరియాలకని, గోధుమ్నూక పటికబెల్లానికని, వానరొట్టికని, పాలకని సోడాబుడ్లకని ఇంటోడబ్బు కాస్తాఅయిపోయింది. జ్వరంతగ్గలేదు. పొద్దున్నలేచి, డాక్టరుగారితో చెప్పి, ఊళ్లోకిబయలుదేరేడు తాను చదువుచెప్పిన పిల్లలతండ్రులు ఏమైనా ఇస్తారేమోయని.

ఒకపిల్లవానితండ్రి దగ్గరకు వెళ్లి, "అయ్యా! మా అమ్మాయికి నలతగాఉంది. పిల్లవాడిజీతంబాపతు ఏమైనాయిప్పించండి చాలా అవసరంగాఉంది," అన్నాడు "అయ్యా మేష్టారుగారు! ఎక్కడాపైసా కన్పించడంలేదు. కొట్టబ్బలుబోలెడురావాలి. ఒక్కళ్లూ ఇవ్వడంలేదు. రేపు అమావాస్యకు తప్పకుండా ఇస్తానండీ" అని స్వంతదిక్కులు ఏకరువుపెట్టేడు ఆయన. ఇంకొకచోటుకి వెళ్లేడు వెంకట్రావు. "ఎక్కడ బేరాలుసారాలు లేవు. బాకీలువసూలు కావడంలేదు. ఈనెల్లోనిక్కచ్చిగావుంది. పైనెల్లో అన్నికలిపి పంపిస్తాలెండి" అన్నాడు—ఇంకొక తండ్రి, "పంతులుగారూ మీరు రెండుమూడుసార్లు వచ్చి, తిరిగి వెళ్లిపోడం చాలా చిన్నతనంగాఉంది. ఇక మీరు రాకండి; రేపటెల్లుండిలో తప్పకుండా పంపుతాను" అన్నాడు - వేరొకచోటికి వెళ్లి, "అయ్యా! చౌదరిగారు! మీరు రెండుమూడునెల్ల నుంచి జీతం ఇవ్వటంలేదు. ఇవ్వాళ చాలాఅవసరంగా వుంది. ఏమైనా ఇప్పించాలి" అన్నాడు - ఆయన "నిజమేనండి, మీకు సరిగ్గా జీతం ఇవ్వటంలేదు. అదిగో! గాదిలో పోసేనుధాన్యం. బస్తా, కాస్త నాలుగురూపాయలేనా అయితే అమ్మేస్తానండి. అమ్మే సినతక్షణం మీజీతంమీకు పువ్వుల్లో పెట్టిఇస్తాను. కొంచం ఓపికపట్టండి" అన్నాడు, ఇంకొకపిల్లవానితండ్రి. "ఏంటయ్యా! సమువూలేదు, సందిలేదు, జీతం జీతమని ఏపించకతింటావు. ఇస్తానులే, ఎ... తానా

331

ఏంటి,? ఎల్లండి, ఇయ్యాళ లేదు." అని తన వాగరికత వెల్లడిచేశేడు. అధోవదనుడై ఇంకో యింటికి వెళ్ళేడు వెంకట్రావు. ఆయన నమస్కారపూర్వకంగా బహూకరించి మేష్టారు పిల్లకి నుస్తీగా ఉన్నందుకు విచారించి చివరకు "పంతులుగారు! ఇవ్వాళ శుక్రవారం, ఇవ్వకూడదు రేపుచూద్దాం లెండి" అన్నాడు మెల్లగా. వెంకట్రావు మరికొందరియింటికి వెళ్ళేడు. ఒకాయన ఇంట్లో లేడు, ఒకాయన ఊళ్ళోలేడు, ఒకాయన ఇప్పుడే ఎక్కడికో వెళ్ళేడు. మరొకనికి నుస్తీగా ఉంది, ఇంకొకడు కోర్టువ్యవహారంతో మునిగిపోయేడు. వేరొకనివద్ద డబ్బులేదు.

ఈప్రకారం తలకొకఇబ్బంది తలకొకమాట తలకొకవంక చెప్పి, వెంకట్రావుని సాగనంపేరు. పాపం! బడిపంతులికి, అహర్నిశలు బాలునివిద్యాభివృద్ధికి పాటుపడు పంతులికి, రక్తమాంసాలు పిల్లలపాలు చేసేపంతులికి, కుమార్తె యస్వస్థతతో కుందుచున్న పంతులికి, సాయంచేయుటకు ఏతండ్రిదగ్గఱ డబ్బు ఉండదు. అన్నీ చిక్కులే, అన్నీ ఇబ్బందులే, అంతా నిక్కచ్చే. అర్ధశేరుమాంసంలేందే ఆశనంగుడువనతనికి, పంతులుజీతానికి కొట్టుఅద్దెలు కొదువఅవుతాయి. సవారీలేని పకోడీలులేందే ఇంటికిరా సాహసంలేని సాహుకారికి, కుర్రవాడి జీతానికి చేరాలుసారాలు ఉండవు. సాయంత్రం పడేటప్పటికి సారాలేందే సానుకూలంగాని ఆసామీకి, అబ్బాయిజీతండబ్బుకి నిక్కచ్చిలో చిక్కుకుంటాడు. సినిమానాటకాలంటే చెవికోసుకునేచాదర్, మేష్టారి కష్టంతీర్చడానికి, ధాన్యం అమ్మాలంటే ధరపెరగాలి,—తన పిల్లకి జ్వరంవస్తే డాక్టరుఫీజు యివ్వడానికి వారంవర్జం లేదు, కాని మానసికవైద్యుడైన పంతులి అవసరం తీర్చడానికి, శుక్రవారం అడ్డుతగుల్తుంది—అసలు, ప్రపంచకంలో పేచీపూచీలేని బాకీ మేష్టారుజీతం. అడిగితే చిరాకు, అడక్కపోతే పరాకు. పిల్లవాడు మారాముచేస్తోంటే, రోజా కానిడబ్బుఇస్తారుకాని మారాములేకుండా బడికితీసుకెళ్ళి నాలుగుముక్కలు చెప్పిన పంతులికి నెలకుపావలా ఇవ్వలేరు. అది దేశ దౌర్భాగ్యం.

అని గొణుక్కుంటూ, తిరిగితిరిగి, అలసి, సొలసి, విసిగి, వేసారి, డస్సి కృస్సి—ఎక్కేగుమ్మం దిగే గుమ్మంతో, జీతంలేని కుక్కసమాధానంతో, చివరకు ముఖంపెట్టేడు వెంకట్రావు. కాని డబ్బు లభ్యం కాలేదు. తాను లేచిన వేళను దూషిస్తూ ప్రొద్దున్నే లేచిచూచినముఖాన్ని తిడుతూ, ఎదురైనశకునాన్ని కసిస్తూ—కాళ్ళీడ్చుకుంటూ—పండ్లుబిగిస్తూ — తల వంచుకుని —దీనముఖంతో—హృదయోద్విగ్నముతో చేతులు నలుపుకుంటూ బుర్రగోక్కుంటూ, సొక్కుచు సోలుచు, నీల్గుచు, మూల్గుచు, ఇంటికివచ్చి, కుమార్తె జ్వరాన్నిగూర్చి ప్రశ్నించేడు. మందుసీసా ఎల్లాగ లేను, పిల్లదానిజ్వరంఎల్లాతగ్గుతుందనే ఆలోచనలతో ఒకచోట చతికిలపడ్డాడు.

అతనిభార్య అతనిఅవస్థ గ్రహించింది. పొద్దున్నుంచి అతనుపడ్డశ్రమ ముఖంలో ప్రతిబింబించింది. అయిల్లాలు వెంటనే ఇంట్లోకి వెళ్ళింది. పెట్టెతీసింది వెదకింది ఖంగారుపడింది. మళ్ళీ వెదికింది. ముఖం చిట్లిస్తూ భర్తదగ్గఱకువచ్చి అంది నిమ్మళంగా:—

"నాగరం తీశారా?"

"ఆ తీశాను"

"అది తాకట్టుపెట్టి మందుసీసాకొనండి, గ్రాంటు వచ్చినతర్వాత విడిపించుకోవచ్చు."

"తాకట్టుపెట్టేను"

"త్వరగా భోజనంచెయ్యండి—మందు తేవచ్చు"

"ఆడబ్బువేరే ఖర్చయింది"

"పిల్ల జబ్బుకంటే ప్రాణాపాయం ఏంవచ్చింది?" వెంకట్రావు మాటుమాటాడలేకపోయేడు. చివరకు అన్నాడు.

"ఇన్స్పెక్టరుగారు రేపు బడిపరీక్షకువస్తారు"

"పిల్లకి ఇల్లావుంటే పరీక్షఎల్లా?—ముందువెళ్ళో రమ్మనకపోయేరూ?"

"నెలాఖరుకి ఆయనకు బదిలీఅవుతుందట. అందు

చేత ఇప్పుడే తొందరపెట్టేరు. కబురంపిలే ఇక వీలులేదట."

"నాగరంమీద ఎన్ని రూపాయలు తెచ్చేరు?"

"ఇనస్పెక్టరుగారి మదుపు ఇరవై రూపాయలు తెచ్చేను, ఇచ్చేను"

"కొంతఇచ్చి మిగిలింది తరవాత ఇస్తాననక పోయేరూ?"

"కష్టం చేతిలో పడితేనేకాని కాలు కదపనన్నారు"

అయితే పిల్లగతిఎల్లా?"

లోకంలో ముడుపులున్నాయి. అమ్మాయికి ఆరోగ్యంగాఉంటే, వెంకటేశ్వరస్వామికి బాల తొడుగు ఇస్తానని. ముడుపుగడుతుంది ముసలమ్మ— అబ్బాయికి కళ్ళు శుభ్రంగావుంటే సుబ్రమణ్యుడికి పువ్వులపడగలు ఇస్తానని ముడుపుకడుతుందితల్లి— పరీక్షప్యాసయితే కోడల్ని తీసుకువచ్చి కుర్రవాడి చేత సత్యనారాయణవ్రతం చేయిస్తానని ముడుపు కడతాడు తండ్రి. కానిడబ్బుఅక్కంతలు వనుపు గుడ్డలో.—అల్లుడికి రిజిస్ట్రారుఆఫీసులో ఉద్యోగం అయితే అయిదువందల కొబ్బరికాయలు ఆంజనేయుడికి కొడతానని అత్తగారు ముడుపుకడుతుంది.— ఇంకా మేకపోతులని, కోడిపెట్టలని, గటంజాతర, అంటూ అనేకముడుపు లున్నాయి. అనుకున్న పని సఫలంఅయితే, సావకాశంగా మీద జరిగించవలసిన ముడుపులివి. కార్యఫలం కాకపోతే కానిడబ్బు ఖర్చులేదు.

వెంకట్రావు సమర్పించిన ముడుపుసంగతి వేరు. స్కూలుపరీక్షచేసి, రిపోర్టుబాగా రాసి, ఎక్కువ గ్రాంటువచ్చేటట్లు చేయుటకు ఇన్స్పెక్టరుగారికి ముడుపుముందే ముట్టచెప్పాలి. పై అధికార్ల దగ్గిర నావల్ల గ్రాంటుతగ్గిస్తే నష్టమిరిగి రాదు—కొత్తపెళ్ళి కొడుకు, కోరినదిఇస్తానంటే, అలకపాన్పు దిగుతాడు. ఇన్స్పెక్టరుగారు కోరిందిఇస్తేనేగాని బడిపరీక్షకు బయలుదేరడు.—గోరుచుట్టుమీద రోకలిపోటులా, ఈముడుపుచెల్లించవలసివచ్చింది వెంకట్రావుకి. "పిల్లగతిఎల్లా" అని భార్య అనేటప్పటికి ఒక వేడినిట్టూర్పు విడిచేడు. అంతలో అతనిమనస్సుకి ఒక ఊహతట్టింది. వెంటనే వచ్చి, డాక్టరుఇచ్చిన చీటీ తీసుకుని బయలుదేరేడు. "పన్నెండుగంట లయింది. భోజనంచేసి వెళ్ళండి. మందులేకపోతే మరి రెండురోజులు తీసుకుంటారు. కాని ప్రాణ భయంరాదు" అనిచెప్పిన భార్య చల్లనిమాటలు అతని హృదయతాపంలో హరించి వినిపించలేదు.

వెంకట్రావు తిన్నగా ఇన్స్పెక్టరుగారిఇంటికి వెళ్ళేడు. పడకకుర్చీలో ఇన్స్పెక్టరుగారుపడుకున్నారు. ఇంట్లో ఉపాధ్యాయుడు, హైటఉపాధ్యాయుడు, అరుగుమీద, చెట్లక్రింద, ఇన్స్పెక్టరుగారి ఇంటి ముందు ఎక్కడచూచిన ఉపాధ్యాయుడే. ఖద్దరుబట్ట ఒకవిధంగా నీరుకాయపట్టినది కట్టుకొని, అట్టిదే చొక్కాతో, తలపాగతో, ఆకుచెప్పులతో, మాసిన తలతో, నీరసముతో, చేతిలో పండ్లబుట్టలవారు, పూలగుత్తులవారు, కూరగంపలవారు, నేతిముంతలు, పెరుగుగిన్నెలు, పొగాకుకట్ట, అనపకాయ, ప్రాను అద్దము, పుటచాపు, పడకకుర్చీ, పాముకోళ్లు పెండలను రంగంసరుకులుపుచ్చుకొని, దేవతాదర్శనమునకై వేచియున్న యాత్రికులవలె, భోజనముచేసిన వారుకొందరు, చేయనివారుకొందరు, వృద్ధులు, మధ్యములు, యువకులు గాగల ఉపాధ్యాయులు వేచియున్నారు.

వెంకట్రావు వెళ్ళేటప్పటికి ఇన్స్పెక్టరుగారొక ఉపాధ్యాయునితో ముచ్చటిస్తున్నారు. ఆ ప్రసంగానంతరం, కొంతసేపటికి, వెంకట్రావు లోపలికివెళ్ళి నమస్కరించి, అనుజ్ఞాతుడై క్రిందచాపలో చతికిల బడ్డాడు, ఉన్నారని. ఆగదిలో కుర్చీలులేవు. ఒక బల్లమాత్రంఉంది. దానిమీద కూర్చోడానికి ఉపాధ్యాయునికి తాహతులేదు. ఉపాధ్యాయుడు కూర్చోవలసినచోటు ఇన్స్పెక్టరుగారు పడకకుర్చీలో కూర్చుంటే, వారికాళ్లక్రింద ఈతాకులచాపలో, లేకపోతే నేలపంచాగతి,- ఉపాధ్యాయులు తావే దార్లేగా... కూర్చుని వెంకట్రావుఅన్నాడు.

"అయ్యా! ఇన్స్పెక్టరుగారూ! ఆపాయంవచ్చింది రక్షించాలి"

"ఏమి? నాయనా! చెప్పు; నా [illegible] అయినంత వరకు సహాయం చేస్తా. మీకు కన్నతల్లిలా నేను

ఉన్నానుకా, కష్టసుఖాలు నాతో చెప్పండి సహాయం చేస్తాను."

"మరేమీలేదండీ, మీకుస్వల్పం. మాఅమ్మాయికి జ్వరంవచ్చింది, మహాప్రళయంగాఉంది నాభార్య నాగరం తాకట్టుపెట్టి మీకుఇరవై..."

"సరే. ఇప్పుడు నన్నేమిచెయ్యమంటావు"

"ఇవ్వాళ ఎక్కడతిరిగినా కాని డబ్బుదొరక లేదండి, పిల్లకి మందుసీసా అర్జంటుగా కొనాలండి, పరీక్ష నాల్గురోజులుపోయేకా చేద్దురుగాని. ఆ సొమ్ము ఇప్పించాలి."

అప్పే. నువ్వుఇవ్వగానే పిల్లకి నాగరంచెయ్యమని కంసాలికి ఇచ్చేశాను. అంతతొందరగాఉంటే మొదటే మానివేయకపోయావు?"

"పోనీ మీ స్వంతంలోది ఒకరూపాయఇవ్వండి. మీ పేరు చెప్పుకు మందుతెచ్చుకుని, మీకు తిరిగి రెండురోజులలో ఇస్తాను"

"లేదునాయనా! నెలాఖరులో మాదగ్గఱరాగి డబ్బుండదు. రేపటిఖర్చు ఎల్లాగా అని నేనే తహతహలాడుతున్నాను."

"మరి గత్యంతరం ఏమిటంటారు?"

"మీకులోటేమిటి! మీకు ఎక్కడైనా దొరుకుతుంది"

"లేదండి. ఇవ్వాళ అగ్గి పుట్టటంలేదు. పోనీ ఒక్కఉపకారం చెయ్యండి. మీ పేర చీటిరాసి ఇవ్వండి. షాపులోకివెళ్ళి అరువుతెచ్చుకుని, రేపు ఇచ్చేస్తాను"

"ఏమిటి! నీకోసం, నేను సిగ్గువిడిచి, అభిమానంలేక, అరువుచీటి వ్రాసియిచ్చేదా, చాలు; బాగుంది! కొంచంసేపుంటే నాభార్య మెళ్లో వస్తువు తాకట్టు పెట్టికూడా డబ్బుఇమ్మంటావు. సరసంగాఉంది, చనువిచ్చినందుకు!! ఇక వెళ్ళు చాలమందిఉన్నారు."

హతభాగ్యుడై వెంకట్రావు బయటికివచ్చేడు. "నెలకు రెండువందల ఏబదిరూపాయల జీతగాడు ఎట్టికీడతనం వెళ్లడిచేశేడు! బడిపరీక్షకని ఇరవై రూపాయలు గుంజుకొని, ప్రాణావసరమంటే, ఒక్క రూపాయ అప్పుగా సర్దుబాటు చెయ్యలేకపోయేడు. ఏమిమానవధర్మం! ఏమిభూతదయ! పండుక్కని, పర్వానికని, వ్రతాలకని, ఘృతానికని;—పిల్లపుట్టిన రోజని, తల్లిచచ్చినరోజని, అమ్మగారు కడుపుతోందని, అల్లుడువస్తాడని, బొమ్మలపెళ్ళని, మాదగ్గర సహస్రవిధాల గుంజుకొని, షాపులోకి చీటిరాసి ఇవ్వమంటే పౌరుషం వచ్చింది! మా అమ్మాయి ప్రాణంకంటె తన పిల్లనాగరం ఎక్కువఅయిందా? చల్లనిమాటలతో సవతితల్లిప్రేమ చూపిస్తూ క్రియాశూన్యుడై, విద్యావంతుడే సాటిమానవునికి ఆపదలో సాయంచేయకపోతే సామాన్యప్రజలమాట చెప్పవలెనా!!!"

అని; అనుకుంటూ, ప్రొద్దున్న కనుపించని తంత్రులఇంటికివెళ్ళేడు. కాని ప్రయోజనం లేకపోయింది. షాపులోకివెళ్ళి అరువు అడుగుదామనుకొన్నాడు. ఊరుపేరులేని ఉపాధ్యాయుడికి అరువుఇచ్చేవాడెవరు? ఇక తిరిగిన లాభంలేదనుకొని, భగవంతుడి మీద భారంవేసి తిన్నగా ఇంటికివచ్చేడు. ఇంటి గుమ్మంలో కాలుపెట్టేటప్పటికి రెండు అశ్రుబిందువులు వంటిమీదపడి భగ్గుమంది. టంగుటంగున ఆరు గంటలుకొట్టేరు. "అయ్యో ఎంతసేపైంది ఇల్లువిడిచి! ఎల్లాఉందో" అని గుండెదిగుల్లుమంది. తలుపుతీసి ఇంట్లోకివెళ్ళేడు. మంచంమీదపిల్లలేదు. వాకిట్లోకి వెళ్ళేడు. తనకళ్ళని తాను నమ్మలేకపోయేడు. తన అమ్మణ్ణి, వాకిట్లో తులసిచెట్టుక్రింద పడకకుర్చీలో పడుకుని "అమ్మా నాన్నవచ్చేడే" అంది.

"ఎల్లావుందిపిల్లకు," అన్నాడు వెంకట్రావు.

"జ్వరం దిగజారింది."

"ఎల్లాతగ్గింది"

"మీరువెళ్ళిన కొంచంసేపటికి పిల్ల దాహంఅని ఏడ్చింది. ఈతులసిఆకు రసంతీసియిచ్చేను. ఆపళంగా నిద్రపోయింది. మూడుగంటలకు లేచింది. ఒకవిరేచనంఅయింది. వంటినిండా ముచ్చెమటలుపోసేయి. కొంచంసేపటికి ఆకలి అవుతోందని, గిలగిల్లాడిపోయింది. ఆయింటివారి ముసలమ్మవచ్చిచూసి, జావ యిమ్మంది. కాస్తజావఇచ్చి, నిద్రపోకుండా ఇక్కడ కూర్చున్నాను. ఇంతమంది పిల్లలకు చదువుచెప్పి వృద్ధిలోకి తీసుకువస్తోంటే ఒక్కళ్లూ సహాయంచెయ్యలేకపోయారా?—కృతఘ్నులు!"

"నాన్నా! ఆపిల్లల్ని ఏమీఅనకండి. వాళ్లుమంచివాళ్ళే" "దిక్కులేనివారికి దేవుడేదిక్కనుమీ!! ఈ తులసిలోఉన్న విష్ణుడే మన పిల్లని రక్షించేడు"—అన్నాడు వెంకట్రావు అమ్మణ్ణిని అక్కునజేరుస్తూ, ముద్దుపెట్టుకొని.

334